batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

14 ఆగస్టు 2026
శుక్రవారం

## ఏసీబీకి చిక్కిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

వెబ్ డెస్క్, బతుకమ్మ :భూ సర్వే నిర్వహించి, రిజిస్ట్రేషన్‌తో పాటు పట్టాదార్ పాస్‌బుక్ జారీకి అవసరమైన నివేదిక అందించేందుకు లంచం తీసుకుంటున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలో గురువారం చోటుచేసుకుంది.

02



# ‘తెలంగాణ రైజింగ్’ కోసం పనిచేయాలి

### సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, బతుకమ్మ : మైనారిటీ యువత విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుని భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమితులైన వారు ‘తెలంగాణ రైజింగ్’ కోసం పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హిందూ, ముస్లింల మధ్య తనకు ఎలాంటి వ్యత్యాసం లేదని, ఇద్దరూ తనకు రెండు కళ్లలాంటి వారని ఆయనన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ మైనారిటీల ప్రతిభా సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 తదితర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఎంపికైన వారితో పాటు నీట్, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన మొత్తం 782 మంది మైనారిటీ అభ్యర్థులను సీఎం అభినందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. చదువొక్కటే మన భవిష్యత్తును మార్చుతుంది. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు చదువుకోవాలి. ఆ తర్వాత విద్యార్థులు స్కిల్స్‌పై దృష్టి సారించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో నైపుణ్యాలు ఉన్న వారికి ఉద్యోగావకాశాలకు కొదవలేదు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లోనూ నైపుణ్యం కలిగిన వారికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని అన్నారు.



02




# పోలీస్ శాఖలో ఫస్ట్ వికెట్ అవుట్


### జోగులాంబ జోన్ డిఐజీ చౌహన్ డిజీపీ కార్యాలయం కు అటాచ్

### పోలీస్ డిపార్ట్మెంట్ పై డిజీపీ ఆనంద్ మార్క్

### మిగిలిన ముగ్గురు ఎవరు అనే చర్చ

02

హైదరాబాద్, బతుకమ్మ :పోలీస్ డిపార్టుమెంట్ లో నలుగురు ఐపీఎస్ ల ప్రవర్తన బాలేదని వరంగల్ పర్యటన సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ చెప్పిన విషయం తెలిసిందే. ఆ..నలుగురిలో ఒక అధికారిపై వేటు పడింది. గురువారం జోగులాంబ జోన్ డీఐజీ చౌహాన్ పై బదిలీ వేటు పడింది.




### లక్ష మందితో సంగారెడ్డిలో

## సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ



02

సంగారెడ్డి, బతుకమ్మ :ఆగస్టు 15న సంగారెడ్డిలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లపై నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రి ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి,



## ముఖ్యమంత్రి పర్యటనకు మేడారం ముస్తాబు

### ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలి

### మేడారం ఆలయ తుది దశ అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

### సమ్మక్క - సారలమ్మ సన్నిధి నుంచి ఒంటరి, వితంతు మహిళల పింఛన్లకు శ్రీకారం

02

వెబ్ డెస్క్, బతుకమ్మ :సమ్మక్క - సారలమ్మ వనదేవతల సన్నిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వస్సల్ టోప్పోతో కలిసి పరిశీలించారు. ఈ నెల 16న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మేడారం పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను వారు సమీక్షించారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మహిళలు మృతి
- ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును ఢీకొన్న లారీ
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీపీ






02

ఆర్మూర్, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండల పరిధిలోని గోవింద్‌పేట్ బ్రిడ్జి సమీపంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. టైర్ పంచర్ కావడంతో జాతీయ రహదారిపై ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ ప్రాంతానికి చెందిన భక్తులు హైదరాబాద్‌లోని చిన్న జీయర్ స్వామి దర్శనం కోసం రెండు టూరిస్ట్ బస్సుల్లో బయలుదేరారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

గోవింద్‌పేట్ బ్రిడ్జి సమీపంలో ముందుగా వెళ్తున్న టూరిస్ట్ బస్సు టీజీ 01 టీ 1864 టైర్ పంచర్ కావడంతో టీజీ 21 టీ 2172 సహా బస్సులను జాతీయ రహదారిపై నిలిపారు. టైర్ పంచర్ కావడంతో కొంతమంది ప్రయాణికులు బస్సు నుంచి దిగి రహదారి మధ్యలోని డివైడర్‌పై కూర్చొని విశ్రాంతి తీసుకుంటున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ జీటీ 27 టీఎఫ్ 7482 డ్రైవర్ ఆగి ఉన్న బస్సును సకాలంలో గుర్తించకపోవడంతో బలంగా ఢీకొట్టాడు. లారీ ఢీకొట్టిన ప్రభావంతో ఆగి ఉన్న బస్సు ముందుకు కదిలి డివైడర్‌పై కూర్చున్న ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో సుజాత (54), మాధవి (47) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సునీత, చిటక్క అనే మరో ఇద్దరు ప్రయాణికులు తీవ్రంగా గాయపడటంతో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారికి వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు.

**సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్**

ప్రమాద సమాచారం అందుకున్న నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాహనాలు ఏ విధంగా నిలిపి ఉన్నాయనే అంశంతో పాటు లారీ బస్సును ఢీకొన్న తీరును అధికారులు కమిషనర్‌కు వివరించారు. సహాయక చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన విధానాన్ని కూడా ఆయన పరిశీలించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

**వాహనాలు నిలిపే సమయంలో జాగ్రత్తలు అవసరం**

జాతీయ రహదారులపై టైర్ పంచర్ లేదా ఇతర సాంకేతిక సమస్యల కారణంగా వాహనాలను నిలిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. వాహనం ఆగిపోయిన వెంటనే ప్రమాద హెచ్చరిక లైట్లు ఆన్ చేయడంతో పాటు, తగిన దూరంలో రిఫ్లెక్టివ్ వార్నింగ్ ట్రయాంగిల్స్ లేదా ఇతర హెచ్చరిక సూచికలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రయాణికులు రహదారిపైకి వచ్చి డివైడర్లు లేదా రహదారి పక్కన కూర్చోవడం అత్యంత ప్రమాదకరమని, వాహనం ఆగిపోయినప్పుడు సురక్షితమైన ప్రదేశంలో ఉండాలని సూచించారు. ప్రమాదంపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం తదితర అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ ఘటనలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ, ఆర్మూర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ కుమార్, ఆర్మూర్, జక్రాన్‌పల్లి, బాల్కొండ ఎస్‌ఐలు, అసిస్టెంట్ ఎంవీఐ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష మందితో సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం బహిరంగ సభకు భారీగా జన సమీకరణ చేపట్టడంతో పాటు వేదిక, భద్రత, ఇతర ఏర్పాట్లపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి సంగారెడ్డికి చేరుకోనున్నారని, సాయంత్రం 4 గంటల వరకు అక్కడే ఉంటారని నేతలు వెల్లడించారు. సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జగ్గారెడ్డి అధికారులకు సూచించారు. జన సమీకరణ, భద్రత, ట్రాఫిక్, వేదిక ఏర్పాట్లు తదితర అంశాల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**పది మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు**

ఉమ్మడి మెదక్ జిల్లాలోని పది నియోజకవర్గాల నుంచి ఒక్కొక్కరి చొప్పున ఎంపిక చేసిన మొత్తం పది మంది లబ్ధిదారులకు సీఎం రేవంత్ రెడ్డి సభా వేదికపైనే కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను స్వయంగా అందజేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను ఆయన ఆదేశించారు. సుమారు లక్ష మంది ప్రజలతో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జగ్గారెడ్డి వెల్లడించారు. సభకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు మేడారం ముస్తాబు

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే రెండుసార్లు మేడారం ప్రాంగణాన్ని సందర్శించి సమ్మక్క--సారలమ్మ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులను సమకూర్చి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు మహాజాతరకు ముందు కుటుంబ సమేతంగా వనదేవతలను దర్శించుకున్నారని గుర్తుచేశారు. రాష్ట్ర మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో బస చేసి, ములుగు జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించారని చెప్పారు. ఈ నెల 16న ముఖ్యమంత్రి మరోసారి మేడారానికి రానున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి, భవిష్యత్తులో చేపట్టాల్సిన విస్తరణ, అభివృద్ధి పనులపై సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇవ్వనున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలు, మార్గదర్శకత్వానికి అనుగుణంగా మేడారాన్ని మరింత అభివృద్ధి చేస్తామని సీతక్క వెల్లడించారు. మేడారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రానున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ములుగు జిల్లా, నియోజకవర్గ ప్రజల తరఫున పేరుపేరునా స్వాగతం పలుకుతున్నామని మంత్రి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి మేడారం ఆలయ ప్రాంగణంలో పర్యటించనున్న నేపథ్యంలో భక్తులు, స్థానిక ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆమె కోరారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని మంత్రి సీతక్క తెలిపారు.

# 'తెలంగాణ రైజింగ్' కోసం పనిచేయాలి

యువతను నైపుణ్యాల్లో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్రం లోని ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామని, పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొచ్చామని సీఎం తెలిపారు. నైపుణ్యం ఉంటే భవిష్యత్తును మార్చుకోవచ్చని పేర్కొంటూ, చిన్న కుటుంబాల నుంచి ఎంతో కష్టపడి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందించారు. మైనారిటీలకు కల్పించిన 4 శాతం రిజర్వేషన్లను తొలగించేందుకు గతంలో ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి విజయవంతం కాలేదని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా మైనారిటీ వర్గాలకు కూడా గణనీయమైన ప్రయోజనం కలుగుతోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్-1తో పాటు పలు ఉద్యోగ నియామకాలు సక్రమంగా జరగలేదని సీఎం విమర్శించారు. గ్రూప్-1 పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అర్హత, నైపుణ్యం కలిగిన వారిని సభ్యులుగా నియమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌తో పాటు నిపుణులతో సంప్రదింపులు జరిపి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిగా ప్రక్షాళన చేశామని సీఎం తెలిపారు. పరీక్షలు, ఉద్యోగ నియామకాలను అడ్డుకునేందుకు అనేక అవరోధాలు ఎదురైనప్పటికీ, అభ్యర్థులను కుటుంబ సభ్యులుగా భావించి హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు న్యాయపరంగా పోరాడి నియామక ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, టీజీఎంఆర్ఈఐఎస్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## నిషేధిత భూముల జాబితాలోని

# (22ఏ ) సర్వే నెంబర్లకు బై- నెంబర్లు

... నిషేధిత భూముల జాబితాలో
ఉన్న హక్కు దారులు ఆందోళన చెందవద్దు
... సీఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్, బతుకమ్మ :నిషేధిత జాబితాల్లో ఉన్న భూములకు సంబంధించి హక్కుదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. నిషేధిత జాబితా (22 A) చేరిన భూముల సర్వే నంబర్లకు బై-నంబర్లు ఇచ్చి హక్కుదారుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కోర్ అర్బన్ (CURE) ప్రాంత పరిధిలో హైదరాబాద్ కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ ఇండ్లు (టవర్స్) నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , దుద్దిళ్ల శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ తో పాటు ప్రజాప్రతినిధుల సమక్షంలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నిషేధిత జాబితాలో పెట్టిన భూముల సమస్యను ప్రస్తావించారు. “భూమి కొనుగోలు చేసిన హక్కుదారుల స్థలాలు ఎక్కడికీ పోవు. నేను హామీ ఇస్తున్నా. కోర్టు కేసుల్లో ఉన్న భూములకు సంబంధించి సర్వే నంబర్‌లో వచ్చిన మొత్తం భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. కోర్టు కేసులున్న స్థలాల వరకు పక్కనపెట్టి మిగతా వాటికి బైనెంబర్లు ఇచ్చి పరిష్కరిస్తున్నారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..” అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. “కూకట్‌పల్లి ప్రాంత ప్రజలకు ఏం కావాలన్నా పనులు చేయించుకోండి. ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకునే అవకాశం వచ్చింది. ఈ ప్రాంతంలో రోడ్లు, ఫ్లైఓవర్లు, చెరువుల పునరుద్ధరణ, విద్య కోసం పాఠశాలలు, కాలేజీలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం అవసరమున్న పరిశ్రమల విషయంలోనైనా నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా చూడాలి” అని ముఖ్యమంత్రి వేదికపైనున్న మంత్రి శ్రీధర్ బాబు కు సూచించారు.“అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రజలు కూడా గత పాలనను, ఈ రెండేళ్ల పాలనను బేరీజు వేసుకోవాలి. గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వేటినీ నిలిపివేయలేదు. అదనంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం” అని సంక్షేమ పథకాలను వివరించారు.“రాష్ట్రంలో 3.28 కోట్ల మంది ప్రజలకు ప్రతి వ్యక్తికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నాం. 200 యూనిట్లు ఉచిత కరెంట్ ఇస్తున్నాం. రూ. 500 లకే సిలిండర్ అందజేస్తున్నాం. కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశాం.
ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఉద్యోగ, ఉపాధి కోసం చదువుల కోసం వెళ్లేవారు నెలకు ఆరేడు వేలు ఆదా చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆర్టీసీకి 12 వేల కోట్లు చెల్లించాం. స్వయం సహాయక సంఘాలు 65 వేల కోట్ల బ్యాంకు లింకేజీ ఇచ్చి రూ. 2500 కోట్ల వడ్డీ చెల్లించాం అని గుర్తు చేశారు.మహిళా సంఘాల పేరిట వెయ్యి బస్సులు కొనిచ్చి ఆర్టీసీకి అద్దెకిప్పించాం. వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటుకు అవకాశం కల్పించాం. ఆదిలాబాద్ అడవుల నుంచి అచ్చంపేట వరకు ఆడబిడ్డలు తయారు చేసిన వస్తువులను విక్రయించుకోవడానికి శిల్పారామంలో మూడున్నర ఎకరాల్లో ఇందిరా మహిళా బజార్ల ఏర్పాటుకు విలువైన స్థలమిచ్చాం. రెండేండ్లు తిరిగేలోపు ప్రభుత్వానికి సంబంధించి అన్ని శాఖల్లో రెండేళ్లు తిరిగేలోపు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. కూకట్‌పల్లిలో వందల కోట్ల విలువ చేసే 11 ఎకరాల భూమిలో మంచి సంకల్పంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మించే అద్భుతమైన కార్యక్రమం చేపట్టాం. నగరంలో నిరుపేదలు ఎవరు ఎక్కడ నివసిస్తున్నారో వారికి అక్కడే ఇండ్లు ఇవ్వాలని సంకల్పించాం. పేదల కోసం నిర్మించే ఇండ్లకయ్యే రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా రద్దు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మంత్రులకు సూచించారు. ఇప్పుడు నిర్మించే ఇళ్లకు సంబంధించి నిరుపేదలకు స్థలం మొత్తం ఉచితంగా అందిస్తున్నాం. నిర్మాణానికి అయ్యే వ్యయంలో ఐదారు లక్షలు లబ్ధిదారులు భరిస్తే నిర్మాణం జరుగుతున్నప్పుడు ఎలా సాగుతుందో ఎప్పుడైనా పరిశీలించే హక్కుదారులవుతారు” అని వివరించారు. “నిరుపేదలు ఉండటానికి ఉండడానికి సొంత ఇళ్లు ఇవ్వాలన్న ఆలోచనతో ముందుకు వెళుతున్నాం. సొంతింటి కల నెరవేరడానికి నూటికి నూరు శాతం అండగా నిలబడుతాం అని సీఎం తెలిపారు.మొదటి విడతగా కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, కంటోన్మెంట్, ఎల్బీనగర్, ఉప్పల్ లాంటి అత్యధికంగా పేదలు ఉండే ప్రాంతాలు, ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల నుండి పనులు చేయడానికి ఇక్కడికి వలసలు వచ్చిన ప్రాంతాల్లో ఉండటానికి మంచి ఇల్లు ఇవ్వడానికి ఈ ప్రభుత్వం కృషి చేస్తోంది.గతంలో ఏదైనా పని చేయాలంటే గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్.. ఇలా తిరగడానికే సమయం సరిపోయేది. అందుకే ప్రజల సౌలభ్యం కోసం సైబరాబాద్ కమిషనరేట్‌ను ఏర్పాటు చేశాం” అని చెప్పారు. “మీ అభివృద్ధి కోసం నిలబడుతా. పది మందికి మేలు చేయాలన్న ఆలోచన నాకుంది. మంచి చేయడానికి చిత్తశుద్ధి కావాలి. మంచి ఆలోచన కావాలి. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించడానికి రోజుకు 18 గంటలు పనిచేయడానికి దేవుడు శక్తినిచ్చారు. అందుకు ప్రజలు.. మీరూ ఆశీర్వదించండి” అని ముఖ్యమంత్రి కోరారు.

# ఏసీబీకి చిక్కిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

బీర్పూర్ (వీ & ఎం) తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మంచికట్ల రాహుల్ ఫిర్యాదుదారుడి భూమికి ఫీల్డ్ సర్వే నిర్వహించి, రిజిస్ట్రేషన్, పట్టాదార్ పాస్‌బుక్ జారీకి అనుకూలంగా నివేదిక ఇవ్వడానికి తొలుత రూ.50 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. ఫిర్యాదుదారుడి అభ్యర్థన మేరకు లంచం మొత్తాన్ని రూ.40 వేల కు తగ్గించేందుకు అధికారి అంగీకరించాడు. అందులో రూ.30 వేలను ఆగస్టు 13న, మిగిలిన రూ.10 వేల ను పని పూర్తయిన తర్వాత ఇవ్వాలని ఒప్పందం కుదిరినట్లు ఏసీబీ వెల్లడించింది. ఈ మేరకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.30 వేల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ కరీంనగర్ యూనిట్ అధికారులు బీర్పూర్‌లోని సిరిపురం కాలనీలో ఉన్న ఫిర్యాదుదారుడి నివాసంలో రాహుల్‌ను పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి రూ.30 వేల నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిక పదవిని దుర్వినియోగం చేస్తూ, విధులను అక్రమంగా నిర్వహించి అనుచిత ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ పేర్కొంది. నిందితుడిని అరెస్టు చేసి కరీంనగర్‌లోని ప్రత్యేక ఎస్పీఈ ఠ ఏసీబీ కేసుల న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు తెలిపింది. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. ఫిర్యాదుదారుడి భద్రతా కారణాల దృష్ట్యా ఆయన వివరాలను ఏసీబీ వెల్లడించలేదు.

# పోలీస్ శాఖలో ఫస్ట్ వికెట్ అవుట్

డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీఐజీ చౌహాన్ పై వేటు పడటంతో.. మరో ముగ్గురిపై కూడా వేటు పడనున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతుంది. అవినీతి ఆరోపణలతోనే ప్రభుత్వం విధుల నుంచి తప్పించిందని ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి. డీఐజీ చౌహాన్ పై గతంలో పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. విధి నిర్వహణలో తీవ్రమైన నోటి దురుసు, ఉన్నతాధికారులపై సైతం అనుచిత వ్యాఖ్యలు చేస్తారని ఆయనపై విమర్శలున్నాయి. విజిట్ , ఇన్‌స్పెక్షన్‌కు వెళ్లినప్పుడు ప్రత్యేక ఆతిథ్యం కల్పించాల్సిందేనని, కనీసం ఆరు రకాల మాంసాహార వంటకాలు, బిర్యానీలతో ఖరీదైన విందులు ఏర్పాటు చేయాలనే వింత నిబంధనలతో కిందిస్థాయి సిబ్బందిని వేధించేవారని ఆరోపణలు ఉన్నాయి. పోలీసు శాఖలో హెడ్ కానిస్టేబుల్, ఏఎస్సై, ఎస్సైల బదిలీలు , పోస్టింగ్‌లలో నేరుగా జోక్యం చేసుకుంటూ పెద్ద మొత్తంలో వసూలు చేశారని, తన మాట వినే అనుకూలమైన వారికే ప్రాధాన్యమిచ్చారనే విమర్శలు వెల్లువెత్తాయి.

# ఓపెన్ హార్ట్ సర్జరీతో గుండెలో కణితి తొలగింపు

## గుండె శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ రాకేష్ కుమార్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :గుండెలో ఏర్పడిన కణితి కారణంగా రక్తసరఫరాకు ఏర్పడిన తీవ్ర ఆటంకాన్ని ఓపెన్ హార్ట్ సర్జరీ ద్వారా విజయవంతంగా తొలగించినట్లు మెడికవర్ హాస్పిటల్స్ గుండె శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ రాకేష్ కుమార్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్టలో ఉన్న మెడికవర్ హాస్పిటల్స్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. సుమారు 40 ఏళ్ల వయసున్న మహిళ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కాళ్ల వాపులతో ఆస్పత్రికి వచ్చినట్లు డాక్టర్ రాకేష్ కుమార్ తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించగా గుండెలో కణితి ఏర్పడి రక్తసరఫరాకు ఆటంకం కలుగుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. రోగి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ హార్ట్ సర్జరీ నిర్వహించి, రక్తసరఫరాకు అడ్డుగా ఉన్న కణితిని విజయవంతంగా తొలగించినట్లు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం మహిళ కోలుకుని ఆరోగ్యంగా ఇంటికి వెళ్లినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్‌లో తొలిసారిగా ఇలాంటి క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గుండెలో ఏర్పడే ప్రతి కణితి క్యాన్సర్‌కు సంబంధించినది కాదని డాక్టర్ రాకేష్ కుమార్ స్పష్టం చేశారు. క్యాన్సర్‌కు సంబంధించిన కణితులు, ఇతర కారణాలతో ఏర్పడే కణితుల లక్షణాల్లో తేడాలు ఉంటాయని తెలిపారు. క్షయవ్యాధి వంటి ఇతర కారణాల వల్ల కూడా కొన్ని సందర్భాల్లో కణితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. నిపుణులైన వైద్యుల సూచన మేరకు పరీక్షలు చేయించుకుని, సరైన సమయంలో చికిత్స తీసుకోవాలని సూచించారు. మత్తు వైద్య నిపుణుడు డాక్టర్ ఏలేటి వను మాట్లాడుతూ గుండెలో కణితి కారణంగా రక్తసరఫరాకు ఆటంకం ఏర్పడటం అరుదైన, సవాలుతో కూడుకున్న పరిస్థితి అని తెలిపారు. సకాలంలో




వ్యాధిని గుర్తించి, సరైన సమయంలో శస్త్రచికిత్స చేయడం ద్వారా రోగికి మంచి ఫలితం అందించగలిగామని చెప్పారు. మెడికవర్ హాస్పిటల్స్ డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కూరపాటి యజ్ఞ మాట్లాడుతూ ఇలాంటి క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సను నిజామాబాద్‌లో విజయవంతంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ స్వామి, డీఎంఎస్ యజ్ఞ, వినయ్ కుమార్, మార్కెటింగ్ హెడ్ తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు

మాక్లూర్, బతుకమ్మ :ఐఎంఎల్ డిపో హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు అన్నారు. ఈ విషయాన్ని కోరుతూ మాక్లూర్ మండల తహసీల్దార్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో హమాలీ కార్మికుల కోసం ప్రత్యేకంగా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని, హెల్త్ కార్డులు అందజేస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డులు, సివిల్ సప్లైస్, రైస్ మిల్లులు, దాల్ మిల్లులు, గిడ్డంగులు, వ్యాపార సంస్థలు, బజారు ముఠాలు, కోల్డ్ స్టోరేజీలు, కూరగాయలు--పండ్ల మార్కెట్లు, రైల్వే, సిమెంట్, స్టీల్ తదితర రంగాలతో పాటు



గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులు ప్రజలకు నిత్యావసర సరుకులు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినా హమాలీల కూలీ రేట్లు పెరగలేదని, పని భద్రత, సామాజిక భద్రత, ఆరోగ్య రక్షణ, సంక్షేమ సౌకర్యాలు లేక వేలాది మంది హమాలీ కార్మికులు తీవ్ర ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కొండ గంగాధర్ మాట్లాడుతూ, ఐఎంఎల్ డిపో కార్మికుల్లో 50 సంవత్సరాలు పైబడిన హమాలీ కార్మికులకు నెలకు రూ.6,000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని, కార్మికులందరికీ హెల్త్ కార్డులు అందించాలని కోరారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు రమేష్, లక్ష్మణ్, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ‘శ్రీమద్రామాయణం’కు తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం


హైదరాబాద్, బతుకమ్మ :ప్రముఖ కవి, తెలంగాణ గవర్నర్ జాయింట్ సెక్రటరీ, సీనియర్ గ్రూప్-1 అధికారి శశికిరణ్ కొమాండూర్ రచించిన పద్య మహాకావ్యం ‘శ్రీమద్రామాయణం’ ప్రతిష్ఠాత్మక సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైంది. 2024 సంవత్సరానికి గాను ఈ పురస్కారం ఆయన రచనకు దక్కింది. పరిపాలనా బాధ్యతలను నిర్వర్తిస్తూనే గత రెండు దశాబ్దాలుగా శశికిరణ్ కొమాండూర్ సాహిత్య సాధన కొనసాగిస్తున్నారు. సామాన్య పాఠకుడికి సైతం సులభంగా అర్థమయ్యే వాడుకభాషలో, ఛందోబద్ధంగా ‘శ్రీమద్రామాయణం’ను ఆయన రచించారు. ప్రముఖ ప్రచురణ సంస్థ ఎమెస్కో ఈ మహాకావ్యాన్ని ప్రచురించింది. సాహితీవేత్తగా గుర్తింపు పొందిన శశికిరణ్ కొమాండూర్ వ్యక్తిగత జీవితంలోనూ నైతిక విలువలు, నిజాయితీకి ప్రాధాన్యం ఇచ్చే అధికారిగా పేరొందారు. గతంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారానికి ఆయన రచన పరిశీలనకు వచ్చినప్పటికీ, అప్పట్లో తాను సంబంధిత కేంద్ర మంత్రివద్ద విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో నైతిక కారణాలతో ఆ అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. పదవిలో ఉన్న సమయంలో తన శాఖకు సంబంధించిన అవార్డును స్వీకరించడం వల్ల విమర్శలకు తావివ్వకూడదన్న ఉద్దేశంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నైతిక విలువలకు ప్రాధాన్యమిస్తూ సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న శశికిరణ్ కొమాండూర్‌కు తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం లభించడం పట్ల కవులు, రచయితలు, ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

### లోక్‌భవన్‌లో ఘన సత్కారం

తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైన శశికిరణ్ కొమాండూర్‌ను లోక్‌భవన్‌లో గ్రూప్-1 అధికారుల సంఘం



అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, గవర్నర్ ఉప కార్యదర్శి జి. పల్లవి, ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం, సమన్వయ అధికారి మురళీచార్యులు, అకౌంట్ ఆఫీసర్ శైలజ, అసిస్టెంట్ కంప్ట్రోలర్ జెడ్. హెరాల్డ్ డేవిడ్, ఉద్యానవన అధికారిణి మాలిని, డీఈఈ శ్రీధర్, సెక్షన్ ఆఫీసర్ ఎస్. రామచంద్రం, సాంఖ్యక అధికారి శ్రీకాంత్, ఏఈఈలు హర్షవర్ధన్, త్రిష తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లోక్‌భవన్




అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శశికిరణ్ కొమాండూర్‌ను ప్రత్యేకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆయన సాహిత్య సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మెండోరా, బతుకమ్మ :ఇంటిని శుభ్రం చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మెండోరా మండలంలోని కోడిచర్ల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. మెండోరా ఎస్సై సుహాసిని తెలిపిన వివరాల ప్రకారం.. కోడిచర్ల గ్రామానికి చెందిన మెట్టు కైలాస్ (51) బుధవారం తన ఇంటిని శుభ్రం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి దూలలపై ఉన్న ఇనుప రేకుకు తెగిపోయిన విద్యుత్ తీగ తగిలి ఉండటాన్ని గమనించకుండా కైలాస్ ఆ ఇనుప రేకును తాకాడు. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కైలాస్‌ను నిర్మల్‌లోని ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి చేరుకునేలోపే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుహాసిని తెలిపారు.



# విద్యుత్ షాక్‌తో యువకుడికి తీవ్ర గాయాలు

## లైన్మెన్ అనుమతి లేకుండా

## విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన హైమద్ (32) విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరగడంతో హైమద్ అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల వివరాల ప్రకారం.. విద్యుత్ లైన్మెన్ అనుమతి లేకుండా, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న హ్యాండిల్‌ను ఆఫ్ చేసి హైమద్ వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ మరమ్మతులు చేపడుతుండగా ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురైన హైమద్ తీవ్ర గాయాలతో అక్కడే అపస్మారక స్థితిలో పడిపోయాడు. విషయం గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, హైమద్‌ను నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

### పోలీసులకు సమాచారం అందలేదు

ఈ ఘటనపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని ఇందల్వాయి పోలీసులు తెలిపారు. విద్యుత్ మరమ్మతుల సమయంలో సంబంధిత సిబ్బంది అనుమతి తీసుకోకుండా పనులు చేపట్టడం ప్రమాదానికి కారణమై ఉండొచ్చని స్థానికులు పేర్కొన్నారు.

# ఇందల్వాయిలో ఘనంగా బీజేపీ తిరంగా ర్యాలీ



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు జాలిల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో ద్విచక్ర వాహనాలతో మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ప్రదర్శన చేపట్టారు. “మన దేశ గౌరవం మన తిరంగా జెండా.. మన గర్వం మన భారతదేశం” అంటూ దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలను చేతబూని ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరై తిరంగా ర్యాలీని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నయిడి రాజన్న, మఠం ల శేఖర్, శ్రావణ్, నాగేష్, తన్నీరు వాసు, లోకాని గోపి, మెండే అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 174 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

## కళాశాల ప్రిన్సిపాల్ నితిన్ కాబ్రా

వెబ్ డెస్క్, బతుకమ్మ :మెదక్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన మొత్తం 174 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించినట్లు కళాశాల ప్రిన్సిపల్ నితిన్ కాబ్రా వెల్లడించారు. కాంట్రాక్ట్ విధానంలో 18 పోస్టులు ఉన్నాయని, వీటిలో 4 ప్రొఫెసర్లు, 5 అసోసియేట్ ప్రొఫెసర్లు, 6 సీనియర్ రెసిడెంట్లు, 3 ట్యూటర్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 13 నుంచి ఆగస్టు 14, 2026 మధ్యాహ్నం 3 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఔట్సోర్సింగ్ విధానంలో 156 పోస్టులను భర్తీ చేయనున్నారని, వీటిలో డేటా ఎంట్రీ ఆపరేటర్ 37, ఆఫీస్ సబార్డినేట్ 24, ల్యాబ్ అటెండర్ 19, ఓటీ టెక్నీషియన్ 10, అనస్థీషియా టెక్నీషియన్ 8, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్ 7, బార్బర్ 6, దోబీ/ప్యాకర్ 6, ఎలక్ట్రీషియన్ 6 తదితర పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఔట్సోర్సింగ్ పోస్టులకు ఆగస్టు 13, 2026 ఉదయం 11 గంటల నుంచి ఆగస్టు 20, 2026 మధ్యాహ్నం 3 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. అభ్యర్థులు మెదక్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని, పోస్టుల వారీగా విద్యార్హతలు, దరఖాస్తు ఫారం, మార్గదర్శకాలు తదితర పూర్తి వివరాలను మెదక్ ప్రభుత్వ మెడికల్ కళాశాల అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించాలని ప్రిన్సిపల్ సూచించారు.



## నందిపేట్ జెడ్పీహెచ్ఎస్‌లో సోషల్ ఆడిట్



నందిపేట్, బతుకమ్మ :నందిపేట్ జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్ కార్యక్రమంలో భాగంగా పరిశీలకురాలు మమత గురువారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మౌలిక వసతులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. అదే విధంగా జెడ్పీహెచ్ఎస్ నందిపేట్‌లో స్టేట్ టీమ్ సభ్యులు నూతన్, బిందు సోషల్ ఆడిట్ నిర్వహించారు. పరీక్షల విభాగం, సైన్స్ ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్, స్పోర్ట్స్ రూమ్, గ్రంథాలయం, అలాగే పాఠశాల ఆదాయ--వ్యయ లెక్కలను సమగ్రంగా పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతుల పరిస్థితిపై వివరాలను సేకరించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను స్వీకరించారు. సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి సోషల్ ఆడిట్‌కు సంబంధించిన సమగ్ర నివేదికను రూపొందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. కృష్ణాజీ, ఉపాధ్యాయ బృందం, నందిపేట్ గ్రామ సర్పంచ్ ఎర్రం లింగం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రజిత, వార్డు మెంబర్ సలీం, నీలోఫర్ మసీదు కమిటీ అధ్యక్షులు సయ్యద్ కలం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



బాల్కొండ, బతుకమ్మ :రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం బాల్కొండ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బాల్కొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, అనంతరం వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, కేజీబీవీలు, గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో ఈ నెల 21న జిల్లా కేంద్రంలో ధర్నా, 29న రాష్ట్ర రాజధానిలో వేలాది మంది ఉపాధ్యాయులతో భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఓ. రమేష్, ఓడ్నాల శ్రీనివాస్, బోయిడ నరసయ్య, కే. చంద్రశేఖర్, పబ్బ శంకర్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



రుద్రూర్, బతుకమ్మ :హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం రుద్రూర్ మండల సమీకృత సముదాయముల భవనం ఎదుట ఆందోళన చేపట్టి, తహసీల్దార్ తారాబాయి కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, సీఎం రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకోవాలని కోరారు. 55 సంవత్సరాలు నిండిన హమాలీ కార్మికులందరికీ 6వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 120 గజాల స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు భీమయ్య, మహబూబ్, లక్ష్మణ్, సాయిలు, పీరయ్య, గంగాధర్, కిరణ్, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు

# అధికారులందరూ సమన్వయంతో పని చేయాలి

### స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, పంద్రాగస్టు వేడుక ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో, జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఈ నెల 15న సంగారెడ్డిలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనుండగా, జిల్లా స్థాయిలో నిజామాబాద్ నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఈ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. ప్రభుత్వ సలహాదారులు, ఎం.పీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్లు, రేషన్ కార్డు లు కలిగిన లబ్ధిదారులు హాజరు కానున్న దృష్ట్యా, పక్కాగా ఏర్పాట్లు ఉండాలన్నారు. వేదికను అందంగా ముస్తాబు చేయాలని, ప్రోటోకాల్ ను అనుసరిస్తూ ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ కూడా గందరగోళానికి తావు లేకుండా ముందస్తుగానే పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సీటింగ్ అరేంజ్మెంట్, పార్కింగ్ వంటి అన్ని ఏర్పాట్లు చక్కబెట్టుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు బాధ్యతలు పురమాయించారు. అలాగే, ఈ నెల 15న ఉదయం వేళలో పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కూడా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సాధించిన పురోగతిని సమగ్రంగా తెలిపేలా ముఖ్య అతిథి ప్రసంగం నివేదిక ఉండాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి స్టాళ్లను, శకటాలను ఏర్పాటు చేయాలన్నారు. దేశభక్తిని పెంపొందించేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని, స్వాతంత్ర్య సమరయోధులను, వారి కుటుంబీకులను ఘనంగా సత్కరించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు, అనధికారులు, ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ప్రశంసా పత్రాల గ్రహీతలు, ప్రజలు వేడుకలను వీక్షించేందుకు వీలుగా సీటింగ్ అరేంజ్మెంట్ చేయాలని అన్నారు. ప్రశంసా పత్రాల పంపిణీ, పతాక ఆవిష్కరణ, వేదిక అలంకరణ, టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టం, మైక్, ప్రోటోకాల్ ప్రకారంగా ప్రముఖుల ఆహ్వానం, నిరంతర విద్యుత్ సరఫరా, అత్యవసర ఏర్పాట్లు, అగ్నిమాపక, వైద్య సేవలు తదితర అన్ని ఏర్పాట్లను సరి చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో, పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జరిగే పంద్రాగస్టు వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా రెవెన్యూ అధికారి బి.గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ సాయన్న, సీ.పీ.ఓ కిషన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చెత్త సేకరణ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలి

### రోడ్లపై పశువులు సంచరించకుండా చర్యలు చేపట్టాలి
### కలెక్టర్ భవేష్ మిశ్రా
### డంపింగ్ యార్డు సందర్శన





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు సంచరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ను ఆదేశించారు. నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ గురువారం సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికీ తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా బయో మైనింగ్ సులభం అవుతుందని అన్నారు. వ్యర్థాలను శుద్ధి చేస్తూ కంపోస్ట్ తయారీ కోసం ప్రతిపాదించిన మేరకు వేస్టేజ్ ప్రాసెసింగ్ యంత్రాల ద్వారా శుద్ధి ప్రక్రియ జరిపించాలన్నారు. నగరంలో ప్రధాన మార్గాలలో రహదారులపై ఎక్కడబడితే అక్కడ ఆవులు, ఇతర పశువులు సంచరిస్తుండడం వల్ల ప్రజలు, ప్రత్యేకించి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పశువులు రోడ్లపై సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్లపై తిరిగే పశువులను గోశాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

# తిమ్మాపూర్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ ర్యాలీ

### జాతీయ జెండాల పంపిణీ, పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమాలు





తిమ్మాపూర్, బతుకమ్మ :స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తిమ్మాపూర్ గ్రామంలో సర్పంచ్ పుప్పాల నరేష్ అధ్యక్షతన గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో గ్రామస్తులకు ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ చెత్త, ప్రత్యేక జాగ్రత్తలతో నిర్వహించాల్సిన చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి సేకరించే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు గ్రామసభలో కీలక నిర్ణయం తీసుకున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించిన వారికి రూ.5,000 జరిమానా విధించేలా గ్రామసభ తీర్మానం చేసినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ పక్కాగా అమలు చేస్తోందని సర్పంచ్ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ, ప్రతి పథకాన్ని క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సదానంద్, పంచాయతీ కార్యదర్శి బాస నరేందర్, పాలకవర్గ సభ్యులు, వివిధ శాఖల గ్రామస్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని వెంటనే పునఃప్రారంభించాలి





### చెరకు ఉత్పత్తి దారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య

నిజామాబాద్ రూరల్, బతుకమ్మ : మూతపడిన సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని వెంటనే పునఃప్రారంభించి, రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా ప్రభుత్వమే నిర్వహించాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీని ఆధునీకరించి చక్కెరతో పాటు బెల్లం, ఇతర అనుబంధ ఉత్పత్తుల తయారీకి అవకాశం కల్పించాలని కోరారు. గురువారం సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ ఆవరణలో చెరుకు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సమ్మేళనంలో సుమారు 180 మంది రైతు సంఘాల నాయకులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1964లో రైతుల వాటాలతో, ప్రభుత్వ సహకారంతో ఏర్పాటైన సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ దశాబ్దాలుగా వేలాది మంది రైతులు, కార్మికులకు జీవనాధారంగా నిలిచిందన్నారు. 2008 లో ఫ్యాక్టరీ మూతపడటంతో రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఫ్యాక్టరీ మూతపడిన తర్వాత చెరకు సాగు తగ్గిపోయి రైతులు ఇతర పంటల వైపు మళ్లారని చెప్పారు. గతంలో ఫ్యాక్టరీకి 23,143 మంది రైతులు సభ్యులుగా ఉండేవారని, ప్రతి ఏడాది 5 వేల నుంచి 6 వేల మంది రైతులు చెరకును సరఫరా చేసేవారని తెలిపారు. ఫ్యాక్టరీ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మందికి పైగా ఉపాధి లభించేదన్నారు. రైతుల వాటాలతో ఏర్పాటైన పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించకుండా ప్రభుత్వం నిధులు కేటాయించి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రైతులు తిరిగి చెరకు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వం ఫ్యాక్టరీని పునఃప్రారంభించి చెరకు కొనుగోలుకు హామీ ఇస్తే ఈ ప్రాంతంలో చెరకు సాగు మళ్లీ పుంజుకుంటుందని అన్నారు. ఫ్యాక్టరీని ఆధునీకరించి చక్కెరతో పాటు బెల్లం వంటి అనుబంధ ఉత్పత్తులను తయారు చేస్తే రైతులకు మెరుగైన మార్కెట్, ధరలు లభించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీలు ఇచ్చినా అమలు చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం పట్ల రైతుల్లో అసంతృప్తి నెలకొందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్‌కమిటీ నివేదికను పరిగణనలోకి తీసుకుని ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమన్న, రైతు నాయకుడు సిరిపూర్ గంగారెడ్డి మాట్లాడుతూ ఫ్యాక్టరీ పునఃప్రారంభమైతే సుమారు 10 వేల మంది రైతులు, వ్యవసాయ కార్మికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అన్నారు. రైతులు చెరకు సాగుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఫ్యాక్టరీ మూతపడటం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా ఆలస్యం చేయకుండా ఫ్యాక్టరీని వెంటనే ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. పునఃప్రారంభంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే రైతులను సమీకరించి వందలాది ట్రాక్టర్లతో "చలో నిజామాబాద్" కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతులు, వ్యవసాయ కార్మికుల జీవనాధారమైన ఫ్యాక్టరీ కోసం జరిగే పోరాటానికి అందరూ ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. బికెఎస్ అధ్యక్షుడు కొండేలా సాయిరెడ్డి మాట్లాడుతూ సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఫ్యాక్టరీ తెరవడానికి తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. రైతు సమ్మేళనంలో ఫ్యాక్టరీ పునఃప్రారంభం, చెరకు సాగు ప్రోత్సాహం, రైతుల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై పలు తీర్మానాలు చేసి ఫ్యాక్టరీ ఎండీకి అందజేశారు. మూతపడిన ఫ్యాక్టరీని పునఃప్రారంభించి బెల్లం కేంద్రంగా మార్చి ప్రభుత్వమే నిర్వహించాలని, రైతులను చెరకు సాగు వైపు ప్రోత్సహించాలని, ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని తీర్మానించారు.ద

ఈ కార్యక్రమంలో చెరుకు ఉత్పత్తిదారుల సంఘం నాయకులు ఆర్. పృధ్వీరాజ్, ఫాలా రాజారెడ్డి, బి. లక్ష్మారెడ్డి, వై. సంతోష్, టేక్మల్ లక్ష్మణ్, కొట్టె గంగాధర్, సిర్ప నాగయ్య, బి. సాయిలు, అగు ఎర్రన్న, అర్సపల్లి గోపాల్ తదితరులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నాను

### ప్రజల ఆశీర్వాదంతో ఏడు దఫాలుగా ప్రజా సేవ చేసే అవకాశం లభించింది

### నేను అమ్ముడు పోయే వ్యక్తిని కాదు... డబ్బులు తీసుకునే వ్యక్తినీ కాదు

### మరోసారి పోచారం శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ నియోజకవర్గ ప్రజల కోసం ఏమైనా, ఏ త్యాగమైన చేయడానికి తాను సిద్ధంగా ఉన్నాననీ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం జాకోరా గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తనపై వస్తున్న విమర్శలు, వ్యాఖ్యలపై స్పందించారు.తన వ్యాఖ్యల్లో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు.తాను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదని పోచారం పేర్కొన్నారు. తనకు స్వార్థం ఉందంటూ కొందరు బుద్ధిహీనులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించాల్సిన అవసరం లేదన్నారు.కేసీఆర్ చేసిన పనులను తాను ప్రశంసించిన సందర్భంలో కేసీఆర్ చేశారు కాబట్టే చేశారనే చెప్పాను అని పోచారం వివరించారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరిస్తానని ఆయన తెలిపారు.ప్రజల కోసమే తన జీవితం అంకితం చేశానని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజలకు అనుకూలంగా పనిచేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. తనకు ఎలాంటి స్వార్థ ప్రయోజనాలు లేవని, తాను ఎవరి వద్దా డబ్బులు తీసుకోలేదని స్పష్టం చేశారు. తాను అమ్ముడుపోయే వ్యక్తిని కాదని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఏడు దఫాలుగా ప్రజా ప్రతినిధిగా సేవ చేసే అవకాశం తనకు లభించిందని పోచారం తెలిపారు. నియోజకవర్గ ప్రజల కోసం ఏమైనా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరి పేరును ప్రస్తావించడం తన ధర్మం, మానవత్వమని పోచారం పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో సహకరించిన వారిని గుర్తించి వారికి కృతజ్ఞతలు చెప్పడం తప్పు కాదని ఆయనన్నారు.

## కౌలాస్ నాలా ప్రాజెక్టుకు 130 క్యూసెక్కుల వరద నీరు



జుక్కల్, బతుకమ్మ :కౌలాస్ నాలా ప్రాజెక్టులోకి 130 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 458 మీటర్లు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 457.50 మీటర్లకు చేరినట్లు ప్రాజెక్టు అధికారి శివకుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 130 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నప్పటికీ, అవుట్‌ఫ్లో లేదని శివకుమార్ తెలిపారు. నీటి ప్రవాహాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

## నిజామాబాద్‌లో టర్మ్ పాలసీ డెత్ క్లెయిమ్ చెల్లింపు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్ నిజామాబాద్ బ్రాంచ్‌లో గురువారం టర్మ్ పాలసీకి సంబంధించిన డెత్ క్లెయిమ్ మొత్తాన్ని నామినీకి అందజేశారు. నీరుడి బాబు ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్ లో టర్మ్ పాలసీ తీసుకున్న అనంతరం మరణించడంతో, పాలసీకి సంబంధించిన రూ.50,01,923 క్లెయిమ్ మొత్తాన్ని ఆయన భార్య, నామినీ నీరుడి కవితకు అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ హెడ్ గుడ్ల కవిత, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ రాహుల్ కులకర్ణి, గణగణ నరేశ్, ఇట్టా స్వప్న, శ్రీపాదం రాహుల్ తదితర బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు. పాలసీదారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో జీవిత బీమా పాలసీలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా బ్రాంచ్ ప్రతినిధులు తెలిపారు.

## జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య...



రుద్రూర్, బతుకమ్మ : మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రుద్రూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై మనోజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూర్ మండల కేంద్రంలోని జేయన్సీ కాలనీకి చెందిన మంచ సాయిలు (43) అను వ్యక్తి ఇంట్లో ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది రుద్రూర్ గ్రామ చెరువులో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని కుమారుడు మంచ సందీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోజ్ కుమార్ వెల్లడించారు.

# పీఆర్సీ, డీఏలు వెంటనే ప్రకటించాలి

### టీపీటీఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల లింగం



కామారెడ్డి, బతుకమ్మ :పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, ఆరు డీఏలను తక్షణమే విడుదల చేయాలని టీపీటీఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల లింగం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని కోరారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యలపై ఆయన మాట్లాడారు. యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నాలుగు దశల ఉద్యమ కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఆగస్టు 12, 13 తేదీల్లో మండలంలోని తహసీల్దార్లకు సమస్యలపై మెమోరాండాలు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 21న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు, 29న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు మహాధర్నాకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చింతల లింగం పిలుపునిచ్చారు. ఉద్యమాలు చేపట్టడం ద్వారానే తమ సమస్యలను సాధించుకోగలమని అన్నారు. 317 జీవోను అమలు చేసి 317 కేటగిరీలోని ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఈహెచ్‌ఎస్ సమస్యను పరిష్కరించి, సాధ్యమైనంత త్వరగా హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సీనియర్ నాయకులు కందుకూరి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు తృప్తి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి అంజయ్య, గాంధారి మండల అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఐడీపీఎల్ చౌరస్తాలో ఘనంగా తిరంగా ర్యాలీ

### దేశ ఐక్యత, సమగ్రతను చాటేలా కార్యక్రమం



వెబ్ డెస్క్, బతుకమ్మ :మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఐడీపీఎల్ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విభిన్న జాతులు, సంస్కృతులు, భాషలు ఉన్నప్పటికీ భారతీయులంతా ఐకమత్యంతో జీవిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ భారతమాత ముద్దుబిడ్డలేనని, 'జనగణమన', 'వందేమాతరం' వంటి జాతీయ భావాలు దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ పటంపై తన ఔన్నత్యాన్ని మరింతగా చాటుకుంటోందని నాయకులు అన్నారు. దేశ అభివృద్ధి, ప్రగతి కోసం నరేంద్ర మోదీకి ప్రజలంతా అండగా నిలిచి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ – మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి, సీనియర్ నాయకులు, ఇంచార్జి డా. ఎస్. మల్లారెడ్డి, జిల్లా ఓబీసీ అధ్యక్షులు జేకే శేఖర్ యాదవ్, సీనియర్ నాయకులు వడేపల్లి రాజేశ్వర్ రావు, జిల్లా జనరల్ సెక్రెటరీ విగ్నేష్, మాజీ కార్పొరేటర్ శేషగిరి రావు, కూకట్‌పల్లి అసెంబ్లీ ఇంచార్జి కాంత రావు, కన్వీనర్ శ్రీకర్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్ల జయశేఖర్ గౌడ్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, సీనియర్ నాయకులు వేముల రమేష్, బీజేవైఎం నాయకులు శ్రీనాథ్, సాయి కిరణ్ రెడ్డి, ఆర్తిక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ జెండాలతో నిర్వహించిన తిరంగా ర్యాలీ దేశభక్తి, జాతీయ సమైక్యత సందేశాన్ని చాటుతూ ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

## కుటుంబ సమేతంగా పిక్‌పాకెటింగ్

### అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్




వెబ్ డెస్క్, బతుకమ్మ :కుటుంబ సభ్యులంతా కలిసి పిక్‌పాకెటింగ్‌కు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను నల్లగొండ టూ టౌన్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. బస్సుల్లో రద్దీని ఆసరాగా చేసుకుని ప్రయాణికుల సెల్‌ఫోన్లు, నగదును అపహరిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కవిత (ఏ1), నాగమణి (ఏ2), ప్రసాద్ (ఏ3) కలిసి పిక్‌పాకెటింగ్‌కు పాల్పడుతున్నారు. బస్సుల్లో రద్దీగా ఉన్న సమయంలో ప్రయాణికులపై నిఘా పెట్టి, వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, నగదును చోరీ చేసేవారని పోలీసులు తెలిపారు. ఇటీవల ఓ చోరీకి పాల్పడిన అనంతరం మరుసటి రోజే అదే ప్రాంతానికి మరోసారి వచ్చిన నిందితులపై టూ టౌన్ పోలీసులకు అనుమానం రావడంతో నిఘా పెట్టారు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఆటోరిక్షా, రూ.3 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాపై ఇప్పటికే పలు జిల్లాల్లో సుమారు 16 పాత కేసులు ఉన్నట్లు టూ టౌన్ సీఐ ఆదిరెడ్డి తెలిపారు. జిల్లా డీఎస్పీ శివరాం రెడ్డి పర్యవేక్షణలో, సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ కొనసాగింది. టూ టౌన్ ఎస్సై డి. సైదా బాబు, మహిళా ఎస్సై మానస, కానిస్టేబుళ్లు బాలకోటి, షకీల్ తదితరులు ప్రత్యేక బృందంగా ఏర్పడి నిందితులను పట్టుకున్నారు. ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన టూ టౌన్ పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు. రద్దీ ప్రాంతాలు, బస్సుల్లో ప్రయాణించే సమయంలో ప్రజలు తమ సెల్‌ఫోన్లు, నగదు, విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక దాడులు కొనసాగించాలి

### రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలి ...నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య





నందిపేట్, బతుకమ్మ :డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు, పేకాట, గుట్కా, ఇసుక, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర దాడులు నిర్వహించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్పష్టం చేశారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారం, శాంతిభద్రతల పరిరక్షణపై సీపీ గురువారం సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. నందిపేట్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆర్మూర్ ఏసీపీతో పాటు సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్సైలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అక్రమ రవాణాలో పాల్గొనే వ్యక్తులపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు తక్షణమే స్పందించి సహాయం అందించాలని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలో నమోదైన హత్య, హత్యాయత్నం, చోరీలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా తదితర కేసుల పురోగతిని కమిషనర్ సమీక్షించారు. పెండింగ్ కేసులను వేగంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత నేరస్థులు, రౌడీషీటర్లు, బెయిల్‌పై విడుదలైన నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, రాత్రి పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, షీ టీమ్స్, ఈగల్ టీమ్స్, చీతా ఫోర్స్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. రిసెప్షన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిశుభ్రత, సిబ్బంది క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని సూచించారు. ఆర్మూర్ డివిజన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని, హైవేలకు అనుసంధానంగా ఉన్న లింక్ రోడ్ల వద్ద అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని సూచించారు. రోడ్లకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించడంతో పాటు రోడ్డు ఇంజినీరింగ్ లోపాలను గుర్తించి నేషనల్ హైవే, స్టేట్ హైవే అధికారులు, ఇతర సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, ఓవర్‌స్పీడ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు రోడ్డు భద్రతా నిబంధనలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే పోలీసుల సహాయం పొందేందుకు ఉపయోగపడే డయల్ 112 సేవపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సేవ గురించి ప్రతి వర్గం ప్రజలకు అవగాహన కల్పించేలా నిరంతరం కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. రాబోయే పండుగలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. వాహనాల తనిఖీలను 24 గంటలూ కొనసాగించాలని, తనిఖీల సమయంలో సిబ్బంది ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ గురునాయుడు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆర్. అంజయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్సైలు, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల పేరుతో సైబర్ మోసాలు

### అంతర్ జిల్లా నిందితుల అరెస్ట్

### గూగుల్, టెలిగ్రామ్ ద్వారా మీసేవ, మనీ ట్రాన్స్ ఫర్ కేంద్రాల వివరాల సేకరణ

### బాధితుల నుంచి సుమారు రూ.15 లక్షల వరకు మోసం.. 28కు పైగా కేసులు



రాజన్న సిరిసిల్ల జిల్లా, బతుకమ్మ :పోలీసు అధికారులమంటూ అమాయకులను నమ్మించి సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ జిల్లా నిందితులను చందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 28కు పైగా కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వారి నుంచి రూ.18 వేల నగదు, మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. నల్గొండ జిల్లా మోతే మండలానికి చెందిన, ప్రస్తుతం హైదరాబాద్ మీర్‌పేటలోని అల్మాస్‌గూడలో నివసిస్తున్న కిలుకాని సాయిచంద్ (30), సూర్యాపేటకు చెందిన, ప్రస్తుతం హైదరాబాద్ మీర్‌పేటలో నివసిస్తున్న కట్కూరి శరత్ కుమార్ (31) ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. నిందితులు గూగుల్, టెలిగ్రామ్ ద్వారా మీసేవ కేంద్రాలు, మనీ ట్రాన్స్‌ఫర్ కేంద్రాల ఫోన్ నంబర్లను సేకరించేవారని పోలీసులు తెలిపారు. అనంతరం బాధితులకు ఫోన్ చేసి తాము పోలీసు అధికారులమని పరిచయం చేసుకునేవారు. అత్యవసరంగా ఆసుపత్రి ఖర్చుల కోసం డబ్బులు అవసరమయ్యాయని చెప్పి, ఫోన్‌పే ద్వారా నగదు పంపించాలని నమ్మించేవారని వివరించారు. మోసానికి ముందుగానే పెట్రోల్ బంక్ సిబ్బందిని సంప్రదించి తమ వాహనం లేదా బోర్ బండి మరమ్మతులకు వచ్చిందని చెప్పి, తమ సార్ డబ్బులు వారి ఫోన్ నంబర్‌కు పంపిస్తారని పేర్కొంటూ నంబర్ తీసుకునేవారు. ఆ నంబర్‌ను బాధితులకు ఇచ్చి మీసేవ నిర్వాహకుల ద్వారా ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేయించేవారు. అనంతరం పెట్రోల్ బంక్‌కు వెళ్లి ఆ నగదును తీసుకునేవారని పోలీసులు తెలిపారు. ఇదే తరహాలో చందుర్తి మండలానికి చెందిన చిలుక పెంటయ్యకు నిందితులు ఫోన్ చేసి, తాము చందుర్తి పోలీస్ స్టేషన్ నుంచి ఏఎస్ఐ శ్రీనివాస్ రెడ్డిగా మాట్లాడుతున్నామని పరిచయం చేసుకున్నారు. తన కుమారుడికి ఆరోగ్యం బాగాలేక హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్పించామని, అత్యవసరంగా రూ.70 వేలు అవసరమని నమ్మించారు. వారి మాటలను నమ్మిన పెంటయ్య డబ్బులు పంపేందుకు సిద్ధం కాగా, నిందితులు హైదరాబాద్‌లోని ఓ పెట్రోల్ బంక్ ఫోన్ నంబర్ ఇచ్చారు. దీంతో పెంటయ్య ఆ నంబర్‌కు రూ.70 వేలు ఆన్‌లైన్‌లో బదిలీ చేశారు. డబ్బులు అందిన వెంటనే నిందితులు ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేయడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన పెంటయ్య చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చందుర్తి సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్, సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ జునైద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. దర్యాప్తులో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి నేరం ద్వారా సమకూరిన సొమ్ములో భాగంగా రూ.18 వేల నగదుతో పాటు మోసాలకు ఉపయోగించిన మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను చాకచక్యంగా అరెస్ట్ చేసిన సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్, ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది అనిల్, గంగారెడ్డిని డీఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించారు.

# సిర్నాపల్లి గ్రామాన్ని సందర్శించిన జిల్లా పర్యాటక శాఖ అధికారి

ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని సంస్థాన్ సిర్నాపల్లి గ్రామాన్ని జిల్లా పర్యాటక శాఖ అధికారి పవన్ కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పర్యాటక ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ముందుగా సిర్నాపల్లి గ్రామంలో ఉన్న అతి పురాతనమైన శ్రీ జానకి బాయ్ నిర్మించిన సంస్థాన్ సిర్నాపల్లి కోటను జిల్లా అధికారి పరిశీలించారు. అనంతరం సర్పంచ్ పోగుల అనిత సాయి కృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలోని పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. గ్రామంలోని వాటర్‌ఫాల్స్‌ను కూడా పరిశీలించిన పవన్ కుమార్, అక్కడ పర్యాటకులను ఆకర్షించే విధంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అన్వేషించారు. సిర్నాపల్లి గ్రామాన్ని సమగ్ర పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని సర్పంచ్ అనిత సాయి కృష్ణ జిల్లా పర్యాటక శాఖ అధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదర్శన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్ఐసీ గంగాధర్, మాజీ ఉపసర్పంచ్ నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలి





## డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజశ్రీ

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజశ్రీ వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, జీవనశైలి వ్యాధులు, క్షయ వ్యాధి, వ్యాధి నిరోధక టీకాలపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, నీటి ట్యాంకులను వారానికోసారి శుభ్రం చేయడంతో పాటు క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, ఖాళీ స్థలాలు, మురుగునీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వినియోగించాలని ఆదేశించారు. డెంగీ కేసు నమోదైన ఇంటి చుట్టూ 50 ఇళ్ల పరిధిలో పైరెత్రం స్ప్రే, 100 ఇళ్ల పరిధిలో టెమిఫాస్ స్ప్రే చేపట్టాలని తెలిపారు. ఇంటింటి జ్వర సర్వే నిర్వహించడంతో పాటు ఉచిత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతిరోజూ రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు. యాంటీ లార్వల్ స్ప్రే, ఫాగింగ్ కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రై డే'గా నిర్వహించి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని అన్నారు. నీటి కాలుష్యం ద్వారా వ్యాప్తి చెందే టైఫాయిడ్, డయేరియా, అతిసారం, కలరా తదితర వ్యాధులను అరికట్టేందుకు నీటి పరీక్ష కిట్లతో నీటి నాణ్యతను నిరంతరం పరీక్షించాలని సూచించారు. డెంగీ బాధితులు ద్రవ ఆహారాన్ని తరచుగా తీసుకోవడంతో పాటు వైద్యుల సూచన మేరకు పారాసెటమాల్ వాడుతూ విశ్రాంతి తీసుకోవాలని తెలిపారు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ సూచించారు. క్షయ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా ఆరు నెలల చికిత్సా కోర్సును పూర్తి చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. జీవనశైలి వ్యాధుల నియంత్రణలో భాగంగా 30 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికీ హైపర్‌టెన్షన్, మధుమేహం, క్యాన్సర్ తదితర వ్యాధులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల కోసం పెండింగ్‌లో ఉన్న వారందరికీ పరీక్షలు పూర్తి చేసి ఎమ్మా లాగిన్‌లో వివరాలను నమోదు చేయాలని, ఇప్పటికే చికిత్స పొందుతున్న వారందరి వివరాలను లైన్ లిస్ట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాల ద్వారా నియంత్రించగల వ్యాధులను టీకాల ద్వారా సమర్థంగా అరికట్టవచ్చని డాక్టర్ రాజశ్రీ తెలిపారు. అనుమానిత ఏఎఫ్‌పీ, మీజిల్స్, షాంపుల్స్ కేసులకు సంబంధించిన నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డీటీసీవో డాక్టర్ దేవి నాగేశ్వరి, పీఓడీటీ డాక్టర్ అంజన, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ శ్రావ్య, జిల్లా ఫార్మసీ సూపర్వైజర్ నారాయణ, హెచ్ఈఈవో జహీద్, డిప్యూటీ డెమో దుర్గారావు, డీహెచ్ఈ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, వివిధ పీహెచ్‌సీల సీఎచ్ఓలు, హెచ్ఈలు, హెచ్ఈఓలు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి

## సర్పంచ్ గంగామణి గంగారాం

ఇందల్వాయి, బతుకమ్మ :ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని, ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ఇందల్వాయి గ్రామ సర్పంచ్ లోకని గంగామణి గంగారాం అన్నారు. గురువారం గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో ప్లాస్టిక్ వినియోగాన్ని గ్రామంలో పూర్తిగా నిషేధించాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రజలు ప్లాస్టిక్‌కు దూరంగా ఉండి, వాటికి ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆమె కోరారు. ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం ఉపసర్పంచ్ మోత్కూరు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ నిబంధనల ప్రకారం తగిన చర్యలు, శిక్షలు విధిస్తామని తెలిపారు. ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు, ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదాలను ప్రతి ఒక్కరూ గుర్తించి ప్లాస్టిక్ వినియోగాన్ని స్వచ్ఛందంగా విడనాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు కన్నయ్య గౌడ్, గంగా దాసు, ఈశ్వర్, వి.డి.సి. వైస్ చైర్మన్ బాగిర్తి నారాయణ, పంచాయతీ కార్యదర్శి భరత్, కారోబర్ పోచయ్య తదితరులు పాల్గొన్నారు.ః



# వరంగల్ పోలీస్ అధికారుల సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నిక

వరంగల్, బతుకమ్మ :వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని రాణి రుద్రమదేవి ప్రాంగణంలో పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఆదేశాల మేరకు ఎన్నికల నోడల్ అధికారి అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు సదయ్య, నాగయ్యల పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఎన్నికల ప్రాంగణానికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలు పూర్తి పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నోడల్ అధికారి, ఎన్నికల నిర్వహణ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ఎన్నికల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న మొత్తం 110 మంది పోలీస్ అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ కొండా కరుణాకర్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ టి. బాబుపై 17 ఓట్ల ఆధిక్యంతో వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా బి. సతీష్ (ఆర్ఐ), బి. శరత్ కుమార్ (ఆర్ఎస్ఐ), ప్రధాన కార్యదర్శిగా ఇ. వీరభద్రరావు (దామెర ఎస్ఐ), సంయుక్త కార్యదర్శిగా టి. నరేష్ (కాజీపేట కానిస్టేబుల్), కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎస్. ప్రవీణ్ కుమార్ (ఏఆర్ కానిస్టేబుల్), కోశాధికారిగా బి. నరేష్ (పాలకుర్తి కానిస్టేబుల్) ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా ఎం. తులసి (మహిళా కానిస్టేబుల్, కాజీపేట), సి.హెచ్. మహేందర్ యాదవ్ (ఏఆర్ కానిస్టేబుల్), ఏ. రమేష్ (ఏఆర్ కానిస్టేబుల్), ఎన్. ప్రవీణ్ (సుబేదారి కానిస్టేబుల్), ఎం.డి. తాజుద్దీన్ (హనుమకొండ ట్రాఫిక్ కానిస్టేబుల్), పి. సర్వేశ్ (పాలకుర్తి కానిస్టేబుల్) ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. సంఘం ద్వారా పోలీస్ అధికారుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆకాంక్షించారు.





# సంగారెడ్డి జిల్లాలో సీఎం పర్యటనకు పటిష్ట భద్రత



సంగారెడ్డి, బతుకమ్మ :తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 15న సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సుమారు 1,500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్పీ భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రతా విధుల్లో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డితో కలిసి ఎలిప్యాడ్, కాన్వాయ్ మార్గం, పార్కింగ్ ప్రాంతాలు, గంజీ మైదాన్, ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, హాస్టల్ గడ్డ, తారా కళాశాల, సీఎస్ఐ చర్చి, ఐబీ చౌరస్తా తదితర ప్రాంతాలను పరిశీలిం చారు. ముఖ్యమంత్రి సభ జరగనున్న అంబేద్కర్ స్టేడియంలోనూ భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. సభా ప్రాంగణంలో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, వీఐపీ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలు, అత్యవసర సేవల నిర్వహణపై సంబంధిత అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.

### ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు

ముఖ్యమంత్రి సభకు వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చే బస్సులు, వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను కేటాయించారు. ఆందోల్ నియోజకవర్గం నుంచి వచ్చే బస్సులకు గంజీ మైదాన్, నారాయణఖేడ్, జిన్నారం, హత్నూర ప్రాంతాల బస్సులకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. జహీరాబాద్, సంగారెడ్డి నియోజకవర్గాల నుంచి వచ్చే బస్సులకు హాస్టల్ గడ్డ ఈద్గా వద్ద, పటాన్‌చెరువు నియోజకవర్గం, ఇందిరేశం, ఈసనాపూర్ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులకు న్యూ బస్ స్టాండ్‌లో పార్కింగ్ కేటాయించారు. నాలుగు చక్రాల వాహనాలకు మహబూబ్ సాగర్ చెరువు కట్ట, ప్రభుత్వ బాలికల పాఠశాలలో, ద్విచక్ర వాహనాలకు ప్రభుత్వ బాలుర పాఠశాలలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. మీడియా వాహనాలకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రత్యేక పార్కింగ్ కేటాయించారు. సభకు వచ్చే బస్సులు, నాలుగు చక్రాల, ద్విచక్ర వాహనాలను కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులకు సహకరించాలని అధికారులు సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు.



# భావప్రకటన స్వేచ్ఛకు గౌరవం

## హేట్ స్పీచ్‌పై కఠిన చర్యలు అవసరం

హైదరాబాద్, బతుకమ్మ :ప్రజాస్వామ్యంలో భావప్రకటన స్వేచ్ఛ ఎంతో కీలకమని, అదే సమయంలో కులం, మతం, ప్రాంతం, భాష వంటి అంశాల ఆధారంగా ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు సామాజిక శాంతి, సామరస్యానికి భంగం కలిగించకుండా చూడాల్సిన బాధ్యత ఉందని తెలంగాణ హేట్ స్పీచ్ సెలెక్ట్ కమిటీ స్పష్టం చేసింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో తెలంగాణ హేట్ స్పీచ్ సెలెక్ట్ కమిటీ రెండవ సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, కోవా లక్ష్మి, మాణిక్ రావు, అబ్దుల్ బలాల, శాసనసభ కార్యదర్శి తిరుపతి, హోంశాఖ కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శితో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజర య్యారు. సమావేశంలో హేట్ స్పీచ్‌ను అరికట్టేందుకు అవసరమైన చట్టపరమైన అంశాలు, ప్రస్తుత చట్టాల అమలులో ఎదురవుతున్న సమ స్యలు, పోలీసు వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లపై సమగ్రంగా చర్చిం చారు. ద్వేషపూరిత ప్రసంగాలను నియంత్రించే విషయంలో ప్రస్తుత పరిస్థితులు, చట్టపరమైన లోపాలు, అమలు విధానాలను అధ్యయనం చేస్తున్నట్లు కమిటీ తెలిపింది. ప్రజల భావప్రకటన హక్కును గౌరవి స్తూనే, ద్వేషాన్ని ప్రోత్సహించే చర్యలను నిరోధించే సమతుల్య విధానాన్ని రూపొందించడమే కమిటీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీ యాలకు అతీతంగా వ్యవహరిస్తూ, ప్రతి ఒక్కరికీ చట్టం సమానంగా వర్తించేలా సిఫార్సులు రూపొందించేందుకు కమిటీ పనిచేస్తుందని తెలిపా రు. సామాజిక సామరస్యం, శాంతిభద్రతలకు విఘాతం కలి గించే ద్వేషపూరిత ప్రసంగాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చట్టపరమైన, పరిపాలనా చర్యలను మరింత పటిష్టం చేయాల్సిన అవ సరంపై సమావేశంలో అధికారులు, కమిటీ సభ్యులు అభిప్రాయాలను పంచుకున్నారు.